క్లుప్తంగా

సన్మానం



వర్ధన్నపేట : టీపీసీసీ చీఫ్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన మహేశ్‌కుమార్ గౌడ్‌ను హైదరాబాద్‌లోని నివాసంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు శనివారం కలిసి శాలువాతో సన్మానించారు. తొలుత మర్యాదపూర్వకంగా కలిసి పూలబొకే అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టీపీసీసీ లీగల్ సెల్ వైస్ చైర్మన్, ప్రముఖ న్యాయవాది నిమ్మాని శేఖర్‌రావు, టీపీసీసీ అధికార ప్రతినిధి బండి సుధాకర్‌గౌడ్, కిసాన్ సెల్ హన్మకొండ జిల్లా అధ్యక్షుడు వెంకట్రాంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బైక్ ర్యాలీ



నర్సంపేట : బొమ్మ మహేశ్ కుమార్‌గౌడ్ టీపీసీసీ అధ్యక్షుడిగా నియమితులవడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ పట్టణంలో జిల్లా స్పోర్ట్స్ కరాటే దు అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం బైక్ ర్యాలీ నిర్వహించారు. స్వీట్లు పంపిణీ చేసి సంబురాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా షోటో ఖాన్ జపాన్ కరాటే దు ఇండియా సంస్థ ఉపాధ్యక్షుడు పాలాయి రవి, స్టేట్ టెక్నికల్ డైరెక్టర్ రచ్చ భవానీ చంద్, స్టేట్ ట్రెజరర్ గుంటి అశోక్ మాట్లాడారు. మహేశ్ టీపీసీసీ అధ్యక్షుడిగా నియామకం కావడాన్ని గర్విస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ట్రెజరర్ నిరంజన్, మండల ఇన్‌చార్జ్ ఇమ్రాన్, ధినేశ్, వర్ధన్నపేట ఇన్‌చార్జి కుమార్‌స్వామి, తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌గా కృష్ణ



నల్లబెల్లి : స్థానిక తహసీల్దార్‌గా ముప్పు కృష్ణ ఆదివారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. సివిల్ సప్లయిస్ విభాగంలో డిప్యూటీ తహసీల్దార్ (డీటీ)గా పని చేసిన ఆయనకు ప్రభుత్వం ఇటీవల ఉద్యోగోన్నతి కల్పించి మండలానికి బదిలీ చేసింది. ఆయనకు కార్యాలయ ఉద్యోగులు పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు.

అంబేడ్కర్ సంఘం పట్టణ అధ్యక్షుడిగా శ్రీనివాస్

పర్వతగిరి : అంబేడ్కర్ సంఘం పట్టణ అధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన జిల్లా శ్రీనివాస్ ఎన్నికయ్యారు. ప్రభుత్వ హైస్కూల్ ఎన్నికలు నిర్వహించగా బొట్ల సుధాకర్‌పై శ్రీనివాస్ 21 ఓట్ల మెజార్టీ సాధించారు. 141 ఓట్లుండగా శ్రీనివాస్‌కు 77, సుధాకర్‌కు 56 ఓట్లు పోలైనట్లు ప్రిసైడింగ్ ఆఫీసర్ చింతపట్ల సురేంద్రరావు, ఎలక్షన్ ఆఫీసర్ మహంకాళి రామస్వామి, కత్తి భాస్కర్, సింగారపు రమేశ్ ప్రకటించారు.

గుండెపోటుతో సీఐ గన్‌మెన్ మృతి

నర్సంపేట రూరల్ : గుండెపోటుతో నర్సంపేట సీఐ గన్‌మెన్ మృతి చెందాడు. ఈ ఘటన పట్టణంలో చోటుచేసుకుంది. వివరాలిలా.. ములుగు జిల్లా మంగపేట మండలంలోని చింతగూడెంకు చెందిన కోమరం జగన్నాథం (45) నర్సంపేట సీఐకి గన్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. వినాయక చవితిని పురస్కరించుకుని పోలీస్ క్వార్టర్స్ ఏర్పాట్లు చేసేందుకు శనివారం వెళ్లి ఇంటికి వచ్చాడు. అనంతరం గుండెపోటుకు గురయ్యాడు. ఆస్పత్రికి తరలించగా వైద్యం చేసేలోపే మృతి చెందాడు.

చికిత్స పొందుతున్న వివాహిత..

నర్సంపేట రూరల్ : చికిత్స పొందుతున్న వివాహిత పరిస్థితి విషమించి మృతి చెందిన ఘటన నర్సంపేట పట్టణంలోని సర్వాపురంలో చోటుచేసుకుంది. వివరాలిలా.. సర్వాపురం గ్రామానికి చెందిన ఎర్నాగి మంజుల (38) నడుము నొప్పి తాళలేక ఈనెల 5న ఇంట్లో గడ్డిమందు తాగింది. కుటుంబీకులు స్థానిక ఆస్పత్రిలో చేర్చగా హనుమకొండలో ఆస్పత్రికి తరతలించారు. అక్కడ మృతి చెందింది.

అనారోగ్యంతో రేషన్ డీలర్..

దుగ్గొండి : మండలంలోని మహ్మదాపురం గ్రామానికి చెందిన రేషన్ డీలర్, తెలంగాణ జాగృతి మహిళా జిల్లా అధ్యక్షురాలు సాంబలక్ష్మి భర్త శ్రీనివాస్ (52) ఆదివారం అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన మృతదేహానికి మాజీ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి-స్వప్న దంపతులు, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాణాప్రతాప్‌రెడ్డి, తదితరులు నివాళులర్పించారు.

పోలీసులకు జేబు దొంగ అప్పగింత

నర్సంపేట రూరల్ : జేబుదొంగను పట్టుకుని పోలీసులకు అప్పగించిన ఘటన నర్సంపేట పట్టణంలోని ఆదివారం సాయంత్రం చోటుచేసుకున్నట్టు తెలిసింది. స్థానికుల కథనం ప్రకారం.. నర్సంపేట మండలంలోని గురిజాలకు చెందిన డక్క సాంబయ్య హన్మకొండ వెళ్లేందుకు నర్సంపేట బస్టాండ్‌కు వచ్చి బస్సు ఎక్కుతుండగా ఆయన జేబులో నుండి రూ.8 వేలు తీస్తుండగా దొంగను పట్టుకుని స్థానికంగా ఉన్న పోలీసుకులకు అప్పగించారు. దీనిపై టౌన్ సీఐ రమణమూర్తిని వివరణ కోరగా ఫిర్యాదు అందలేదని చెప్పారు.

నర్సంపేట : గణనాథుడికి పూజ చేస్తున్న కౌన్సిలర్ పద్మప్రసాద్, తదితరులు



నర్సంపేట : వరమ్మతోట వద్ద ఏర్పాటు చేసిన గణనాథుడికి..



కొలువుదీరిన గణనాథులు

జిల్లాలోని నర్సంపేట, వర్ధన్నపేట, నల్లబెల్లి, నెక్కొండ, చెన్నారావుపేట, ఖానాపురం, వర్ధన్నపేట, సంగెం, గీసుకొండ, పర్వతగిరి, దుగ్గొండి, తదితర మండలాల్లో వాడవాడలా గణనాథులు కొలువుదీరారు. గణపతి ఉత్సవ కమిటీ నిర్వాహకులు మండపాలను సుందరంగా అలంకరించి గణపతి ప్రతిమలను అర్చకుల వేద మంత్రోచ్చరణల నడుమ ప్రతిష్ఠించారు. ఉదయం నుంచే భక్తులు కుటుంబ సమేతంగా మండపాల వద్దకు చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. పలు చోట్ల అన్నదానం చేశారు. వర్ధన్నపేట మండలంలోని ఇల్లందలో ఆజాద్ హింద్ ఫౌజ్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణపతి మండపానికి గ్రామానికి చెందిన అబ్బాస్ అలీ అనే ముస్లిం యువకుడు విరాళం అందించి ఆదర్శంగా నిలిచాడు. నెక్కొండ మండలంలోని పనికరకు చెందిన దేసు శోభారాణి-లక్ష్మణ్ దంపతులు గణపతికి లక్ష పత్తి జంధ్యాన్ని బహూకరించారు.

-సాక్షి నెట్‌వర్క్



నర్సంపేట రూరల్ : సర్వాపురంలో..



వర్ధన్నపేట : ఇల్లందలో..



సంగెం : మండల కేంద్రంలో..



నల్లబెల్లి : శివాలయంలో



చెన్నారావుపేట : లింగగిరిలో..



పర్వతగిరి : పూజలు నిర్వహిస్తున్న భక్తులు



నెక్కొండ : లక్ష పత్తి జంధ్యం బహూకరిస్తున్న లక్ష్మణ్ దంపతులు



దుగ్గొండి : తొగర్రాయి హనుమాన్ ఆలయంలో..



నెక్కొండ : యువత యూత్ ఆధ్వర్యంలో..



రాయపర్తి : మండల కేంద్రంలో..

ఈ రోడ్డుకు మరమ్మతు చేయరా..?



దెబ్బతిన్న సన్నూరు నుంచి చింతలపల్లి వెళ్లే దారి

రాయపర్తి : కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని సన్నూరు నుంచి తొర్రూరు మండలంలోని చింతలపల్లి వెళ్లే రహదారి కొట్టుకుపోయి ప్రమాదకరంగా మారింది. ఈ క్రమంలో ఈ దారి మీదుగా ప్రయాణించే రైతులు, ప్రజలు బెంబేలెత్తుతున్నారు. రోజులు గడుస్తున్నా సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు నేటికీ పట్టించుకున్న దాఖలాల్లేవు. ఈ రోడ్డును మరమ్మతు చేయరా? అంటూ ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఎవరైనా రాత్రి వేళ ఈ రోడ్డు వెంట ప్రయాణిస్తే ప్రమాదాల బారిన పడడం ఖాయమంటూ ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. ఇకనైనా ప్రభుత్వం, ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రహదారికి యుద్ధప్రాతిపదికన మరమ్మతు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

మట్టిరోడ్డు కొట్టుకుపోయినా నిర్లక్ష్యం

మండలంలోని సన్నూరు బాలునాయక్‌తండా శివారులోని దూదియాతండాకు గోప్యాతండా నుంచి నిర్మించిన మట్టి రోడ్డు వర్షాలకు కొట్టుకుపోయినా ప్రభుత్వం, అధికారులు నిర్లక్ష్యంగానే వ్యవహరిస్తున్నారని తండావాసులు మండిపడుతున్నారు. అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదంటూ తండావాసులు రోడ్డు కొట్టుకుపోయిన చోట ఆదివారం నిరసన తెలిపారు. రహదారి సౌకర్యం కల్పించాలని తండావాసులు శనివారం ఆందోళన వ్యక్తం చేశారు. ఇకనైనా అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతు చేయించాలని కోరుతున్నారు.

గేట్‌వాల్వ్ వద్ద నీటి తొలగింపు



ఖానాపురం : మండలంలోని రంగాపురంలోని గేట్‌వాల్వ్ వద్ద నిలిచిన నీటిని పంచాయతీ కార్యదర్శి ఆబేద సిబ్బందితో ఆదివారం తొలగింపజేశారు. వర్షపు నీటిలో ఉన్న గేట్‌వాల్వ్ ద్వారానే తాగు నీరు ఇళ్లకు సరఫరా అవుతుండగా ఏర్పడిన సమస్యను 'గేట్ వాల్వ్ వద్ద నిలిచిన నీరు' శీర్షికతో ఈనెల 7న 'సాక్షి' ప్రచురించిన 'అటెన్షన్ ప్లీజ్' కథనానికి పంచాయతీ కార్యదర్శి స్పందించారు. సిబ్బందితో గేట్‌వాల్వ్‌లోని నీటిని తొలగింపజేశారు.

సాక్షి స్పందన

హెచ్‌ఎంకు అభినందన



చెన్నారావుపేట : జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికైన మండల కేంద్రంలోని జాగృతి విద్యానికేతన్ హెడ్‌మాస్టర్ ఈగ సత్యనారాయణకు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. సత్యనారాయణను స్థానిక ఉపాధ్యాయులు, ప్రముఖులు కలిసి అభినందనలు తెలిపారు. 2003-04 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వవిద్యార్థులు ఆదివారం ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అన్న బీరేంద్ర, పులిశేరు రాజేందర్, ముత్యం రాజు, కెంచ ప్రవీణ్, రాసమల్ల సతీశ్, రొడ్డ కుమారస్వామి, గొట్టె రాజు, బండి జగదీశ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు

వర్ధన్నపేట : జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నట్టు స్థానిక సీఐ శ్రీనివాసరావు, టీటీఐ సీఐ శ్రీనివాసరావు, ఎన్‌హెచ్‌ఏఐ ఏఈ మదన్ తెలిపారు. పోలీసు, ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు ఉప్పరపల్లి క్రాస్ నుంచి రాయపర్తి మండలంలోని కిష్టాపురం క్రాస్ వరకు ఆదివారం పరిశీలించారు. అనంతరం స్థానిక సీఐ శ్రీనివాసరావు, టీటీఐ సీ శ్రీనివాసరావు, ఎన్‌హెచ్‌ఏఐ ఏఈ మదన్ మాట్లాడారు. ప్రమాదాల నివారణ కోసం రంబుల్ స్ట్రిప్స్, బారికేడ్‌లు, సోలార్ బ్లింకింగ్ ఏర్పాటు చేయించాలని నిర్ణయించినట్టు తెలిపారు.

పరామర్శ

రాయపర్తి : మండలంలోని కొలన్‌పల్లికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు, పాలకుర్తి సోమనాథ ఆలయ కమిటీ చైర్మన్ కృష్ణమాచార్యులును అనారోగ్యంతో బాధపడుతుడగా ఆస్పత్రిలో పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఝాన్సిరెడ్డి పరామర్శించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మాజీ కార్పొరేటర్ కుటుంబానికి..

పర్వతగిరి : మండల కేంద్రానికి చెందిన వరంగల్ మాజీ కార్పొరేటర్ పిన్నింటి దశరథ రామారావు ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాన్ని తెలంగాణ స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య పరామర్శించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పిన్నింటి అనిల్‌రావు, మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌నాయక్, పట్టణ అధ్యక్షుడు రాంచందర్, తదితరులు పాల్గొన్నారు.

కొత్తూరులో..

ఖానాపురం : మండలంలోని కొత్తూరుకు చెందిన కౌసల్య (55) గుండెపోటుతో శనివారం మృతి చెందగా బాధిత కుటుంబాన్ని మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ శాఖమూరి హరిబాబు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యడ్ల జగన్‌మోహన్‌రెడ్డి ఆదివారం పరామర్శించారు. అలాగే మాజీ ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బత్తిని శ్రీనివాస్‌గౌడ్ పరామర్శించారు. పరామర్శించిన వారిలో కాంగ్రెస్ అనుబంధ మైనార్టీ సెల్ మండల నాయకుడు ముస్తఫా, తదితరులు పాల్గొన్నారు.

బియ్యం సాయం

నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని గురిజాలకు చెందిన దండు సాంబయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబానికి ముదిరాజ్ ఎంప్లాయీస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (మెపా) వ్యవస్థాపక అధ్యక్షుడు పులి దేవేందర్ ఆధ్వర్యంలో 50 కేజీల బియ్యం అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి చిరంజీవి, జిల్లా ప్రధాన కార్యదర్శి పెండ్యాల కృష్ణ, నాయకులు శ్రీను, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే 'చల్లా' జన్మదిన వేడుకలు

గీసుకొండ : మండలంలోని కోటగండి సమీపంలోని పీడీఆర్ ఫంక్షన్ హాల్‌లో పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి జన్మదిన వేడుకను బీఆర్‌ఎస్ నాయకులు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే ధర్మారెడ్డి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ (పోలీసు) ధర్మారావు, నాయకులు బోడకుంట్ల ప్రకాశ్, పూంద్రు జయపాల్‌రెడ్డి, రాజయ్య, తదితరులు పాల్గొన్నారు.


వరద బాధితులకు సాయం

గీసుకొండ : పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి జన్మదినం సందర్భంగా మండలంలోని పలువురు బీఆర్‌ఎస్ (చల్లా యువసేన) నాయకులు మహబూబాబాద్ జిల్లాలోని ఆకేరు వాగు ఏటిగడ్డతండాలో వరద బాధితులకు ఆదివారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు రాజేందర్, అజార్, తదితరులు పాల్గొన్నారు.


గుడుంబా పట్టివేత

ఖానాపురం : మండలంలోని నాజీతండా క్రాస్ వద్ద అదే తండాకు చెందిన భూక్య గణేశ్, బోడ సరోజన నుంచి 26 ప్యాకెట్లలో తరలిస్తున్న 39 లీటర్ల గుడుంబాను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్సై రఘుపతి మాట్లాడారు. గణేశ్, సరోజన అనుమానస్పదంగా కనిపించడంతో తనిఖీ చేయగా గుడుంబా లభించినట్టు తెలిపారు. ఇద్దరిపైనా కేసు నమోదు చేసినట్టు చెప్పారు.

'ఫర్టిలైజర్' అసోసియేషన్ అధ్యక్షుడిగా భిక్షపతి



భిక్షపతి



మధుమోహన్

నల్లబెల్లి : ఫర్టిలైజర్, పెస్టిసైడ్స్, సీడ్స్ అసోసియేషన్ మండల అధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన పెద్దబోయిన భిక్షపతి ఎన్నికయ్యాడు. ప్రధాన కార్యదర్శిగా కాసం మధుమోహన్‌రెడ్డి, కోశాధికారిగా గంప కేదారి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా భిక్షపతి మాట్లాడారు. సుధీర్‌బాబు, గొనే రాంబాబు, కారుకూరి శ్రీనివాస్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

'అనాలోచిత పోకడలతోనే ప్రకృతి వైపరీత్యాలు'

నర్సంపేట : మానవాళి అనాలోచిత పోకడతోనే ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తాయని టీజేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంబటి శ్రీనివాస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన ఆధ్వర్యంలోని బృందం ములుగు జిల్లా తాడ్వాయి, మేడారం మధ్యలో మెయిన్ రోడ్డుకు ఇరువైపులా సుమారు 500 ఎకరాల్లో నేలమట్టమైన చెట్లను పరిశీలించిందని పేర్కొన్నారు.

అనాథ బాలికలకు అండగా..

● రూ.30 వేల చొప్పున డిపాజిట్



చిన్నారులకు బాండ్‌లు అందజేస్తున్న గ్రామస్తులు

చెన్నారావుపేట : కన్న తల్లి చనిపోయి తండ్రి మానసిక అనారోగ్యంతో బాధపడుతుండగా పెంచిన నాయినమ్మ మృతి చెందడంతో అనాథలుగా మారిన ఇద్దరు బాలికలకు గ్రామస్తులు అండగా నిలిచారు. ఇద్దరి పేరా రూ.30 వేల చొప్పున పోస్టాఫీస్‌లో డిపాజిట్ చేసి బాండ్‌లను ఆదివారం అందజేశారు. స్థానికంగా చర్చనీయాంశంగా మారిన ఈ ఘటన వివరాలిలా.. మండలంలోని ఉప్పరపల్లికి చెందిన కుక్కల రమ్య, సింధుల తల్లి సుమారు పదేళ్ల క్రితం మృతి చెందింది. తండ్రి మానసిక వ్యాధితో బాధపడుతున్నారు. నాటి నుంచి బాలికలిద్దరినీ వారి నాయనమ్మ కుక్కల ముచ్చాలు సాకుతోంది. కాగా ముచ్చాలు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. ఈ క్రమంలో బాలికలిద్దరూ అనాథలుగా మారడంతో గ్రామానికి చెందిన వ్యాపారస్తులు, ఉద్యోగులు, ప్రజలు స్పందించారు. బాలికల కోసం రూ.60 వేల నగదు సమీకరించారు. సదరు డబ్బును పోస్టాఫీస్‌లో డిపాజిట్ చేసి బాండ్‌లను బాలికలకు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు పులి దేవేందర్, మాజీ సర్పంచ్ అందె పార్వతి వెంకటేశ్వర్లు, కలామ్స్ ఫౌండేషన్ కార్యదర్శి పరికి మధూకర్, పోస్ట్ ఆఫీసర్ కోనేరెడ్డి సాంబరెడ్డి, గ్రామస్తులు వట్టె రవి, కిరణ్, రాజు, కర్ణాకర్‌రెడ్డి, శ్రీను, కుమారస్వామి, స్వామి, తదితరులు ఉన్నారు.

విద్యార్థికి 'మాతృభూమి' తోడ్పాటు



హన్సితకు చెక్కు అందజేస్తున్న మోహన్‌రావు

నర్సంపేట : పట్టణానికి చెందిన పేద విద్యార్థిని ఇంజనీరింగ్ విద్య కోసం మాతృభూమి చారిటబుల్ ట్రస్ట్ తోడ్పాటు అందించింది. వివరాలిలా.. పట్టణానికి చెందిన గణిపాక శ్రీనివాస్ కుమార్తె హన్సితకు హైదరాబాద్‌లోని మల్లారెడ్డి కాలేజీలో బీటెక్ కంప్యూటర్ సైన్స్‌లో అడ్మిషన్ లభించింది. నాలుగేళ్ల కోర్సు పూర్తి చేయడానికి కాలేజీ ఫీజు సుమారు రూ.1.20 లక్షలు చెల్లించాల్సి ఉండగా పేదరికంతో హన్సిత కుటుంబం పడుతున్న ఇబ్బందులను పూలే అంబేడ్కర్ యువజన విభాగం సభ్యులు మాతృభూమి నిర్వాహకుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ క్రమంలో ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ మోహన్‌రావు, నిర్వాహకురాలు అర్శనపల్లి వినోద సానుకూలంగా స్పందించారు. హన్సిత అడ్మిషన్ కోసం రూ.40 వేల చెక్కు ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మోహన్‌రావు మాట్లాడారు. పేద విద్యార్థులకు ట్రస్ట్ తోడ్పాటు అందిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి కల్లెపల్లి ప్రణయ్‌దీప్, రాష్ట్ర కార్యదర్శి తడుగుల విజయ్‌కుమార్, పూలే అంబేడ్కర్ యువజన సంఘం నిర్వాహకులు బాణాల శ్రీనివాస్, నాయకులు బాణాల రమేశ్, గన్నారపు సదానందం, కొమ్ముల నవీన్, కొమ్ముల కరుణాకర్, స్వయంకృషి స్వచ్ఛంద సంస్థ నిర్వాహకుడు బెజ్జంకి ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో బీజేపీ బలోపేతమే లక్ష్యం



కండువా కప్పుతున్న రాణాప్రతాప్‌రెడ్డి

నెక్కొండ : జిల్లాలో బీజేపీ బలోపేతమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్టు ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోగుల రాణాప్రతాప్‌రెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని మహేశ్వర గార్డెన్‌లో ఆ పార్టీ మండల అధ్యక్షుడు నాయిని అశోక్ అధ్యక్షతన ఆదివారం జరిగిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో రాణాప్రతాప్‌రెడ్డి మాట్లాడారు. రాష్ట్రంలో బీజేపీ ప్రత్యామ్నాయ శక్తిగా ఎదుగుతోందని చెప్పారు. అనంతరం మండలంలోని సూరిపల్లి గ్రామ శాఖ అధ్యక్షుడు చార్ల సుధీర్‌రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ యశోద, నాయకులు ఎల్లయ్య, కొముయ్య, ప్రవీణ్, మహేశ్, గోవింద్, నర్సయ్య, నిఖిల్, వెంకన్న, సురేష్, యశ్వంత్, విజయ్‌కుమార్, తదితరులు బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేసి బీజేపీలో చేరగా వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఆ పార్టీ మహబూబాబాద్ పార్లమెంట్ కోకన్వీనర్ కట్ల రామచంద్రారెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి శ్రీరంగం సాగర్, జిల్లా కార్యవర్గ సభ్యులు సురేశ్, సతీశ్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్షాలతో అప్రమత్తంగా ఉండాలి

నర్సంపేట : భారీ వర్షాల నేపథ్యంలో రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ సాంస్కృతిక సారథి నర్సంపేట టీం లీడర్ నెల్లుట్ల సుమన్ కోరారు. పట్టణంలోని లెనిన్‌నగర్‌లో ఆటపాటల ద్వారా ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కొద్ది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు చెరువులు, రోడ్లు దెబ్బతిన్నాయని చెప్పారు. వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయని తెలిపారు. ఈగలు, దోమలు ప్రబలడంతోపాటు చెత్తాచెదారం పేరుకుపోయి రోగాల బారిన పడే ప్రమాదం ఉందన్నారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటించాలని సూచించారు. కార్యక్రమంలో సాంస్కృతిక సారథి సభ్యులు యోచన తాళ్ల సునీల్, పడిదం రాజేందర్, గాదెపాక బాబు, బరిగల రవీందర్, చాంద్ పాషా, ప్రశాంత్, రవి, నవీన్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చొరవతో రైతులకు పరిహారం



చెక్కులు అందుకున్న రైతులతో సీఐ, నాయకులు

చెన్నారావుపేట : కావేరీ సీడ్స్ కంపెనీకి చెందిన మొక్కజొన్న విత్తనాలతో పంట నష్టపోయిన రైతులకు ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి చొరవతో పరిహారం లభించిందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భూక్య గోపాల్‌నాయక్ తెలిపారు. బాధిత రైతులకు సీఐ చంద్రమోహన్‌తో కలిసి గోపాల్‌నాయక్ ఆధ్వర్యంలో పరిహారం చెక్కులు ఆదివారం పంపిణీ చేశారు. అనంతరం గోపాల్‌నాయక్ మాట్లాడారు. విత్తనాలు మొలకెత్తక రైతులు నష్టపోవడంతో సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లినట్టు చెప్పారు. ఎమ్మెల్యే స్పందించడంతో ఎకరానికి రూ.55 వేల పరిహారం ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు నన్నెబోయిన రమేశ్, కిసాన్ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు సాధు మధుసూదన్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ బిల్ల ఇంద్రసేనారెడ్డి, నాయకులు ఈర్య నాయక్, రవి, భద్రు తదితరులు పాల్గొన్నారు.

బ్రిడ్జి లేక రైతులకు తీవ్ర ఇబ్బందులు

చెన్నారావుపేట : మండలంలోని పాపయ్యపేట గ్రామ శివారులోని సుద్దరేవుల చెక్‌డ్యాం వద్ద బ్రిడ్జి లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఎంపీసీఐ(యూ) రాష్ట్ర కార్యదర్శి కన్నం వెంకన్న తెలిపారు. ఈ పార్టీ నాయకులు బ్రిడ్జి నిర్మించాల్సిన ప్రదేశాన్ని ఆదివారం సందర్శించి పరిశీలించారు. అనంతరం వెంకన్న మాట్లాడారు. ప్రాజెక్ట్ నిర్మించి సుమారు 25 ఏళ్లు గడుస్తున్నా రైతులకు ఉపయోగపడడం లేదని ఆందోళన వెలిబుచ్చారు. ప్రాజెక్ట్ ద్వారా కాల్వలు నిర్మించి నీటిని విడుదల చేయాల్సి ఉండగా కాల్వలు ఉపయోగంలో లేక ప్రాజెక్ట్ వృథా అవుతోందని చెప్పారు. పాపయ్యపేట, ఎల్లాయగూడెం, పదహారు చింతల్ తండా, బోజెర్వు, జోజిపేటనారాయణ తండాకు చెందిన రైతులు ప్రాజెక్ట్ కింద నుంచి అవతలి వైపు సుమారు 2 వేల ఎకరాల భూమి సాగు చేయడానికి ప్రతిరోజూ వెళ్తుంటారని తెలిపారు. వాగు దాటే సమయంలో ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సిన దుస్థితి నెలకొందని ఆందోళన వెలిబుచ్చారు. గతంలో ఓ మహిళ ప్రాణాలు కోల్పోయిందని గుర్తు చేశారు. వాగు ప్రవహించే సమయాల్లో సుమారు 50 కిలోమీటర్ల మేరకు తిరిగి వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే బ్రిడ్జి నిర్మించి రైతులను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి జన్ను రమేశ్, నాయకులు ముర్రి శ్రీనివాస్, రాజిరెడ్డి, వంశీ, వీరాసింగ్, రవి, తదితరులు పాల్గొన్నారు.